# ప్రొడ్యూసర్ భద్రం



కొడవటిగంటి కుటుంబరావు

“శంకరం, బాబూ? శంకరం బాబూ?”

శంకరం తాను చదువుతున్న పత్రికను మడిచి పక్కన పెడుతూ, “లోపలికిరా, భద్రం,” అన్నాడు.

శుభవార్త తెస్తున్న వాడల్లే భద్రం నవ్వుమొహంతో లోపలికొచ్చి, మూలనున్న స్టూలు లాక్కుని శంకరానికి పక్కవాటంగా కూర్చున్నాడు.

“ఏమిటి విశేషం, భద్రం? పెద్ద పనిమీదే వచ్చినట్టున్నావు,” అన్నాడు శంకరం.

భద్రం బుర్ర వెనకభాగం తడుముకుంటూ, అలిగిన హీరోయిన్‌లాగా ఒళ్లంతా ఒక్కసారి ఆడించి, “ఏం పెద్దపన్లెండి! పెద్దదంటే మరి పెద్దదే. కాని మనం దాన్ని చిన్నదనుకోవాల. అప్పుడు గాని దయిర్యంగా చెయ్యలేం. ఏది - ?” అన్నాడు.

“నీ తస్సదియ్యా, వేదాంతివై పోతున్నావే” అన్నాడు శంకరం.

“యేదోవో దేవాంతం చెయ్యకపోతే మనం పైకొచ్చేదెట్టా గురూగారూ?”

శంకరం సిగిరెట్టుతీసి నోట్లో పెట్టుకుని వెలిగించి, భద్రానికి ఇవ్వబోయాడు.

“సిగిరెట్లు మానేస్తినిగా, శంకరం బాబూ? మీాకు తెలవదెట్టా?” అంటూ భద్రం ఒకజేబులోంచి బీడీ, ఇంకో జేబులోంచి లైటరూ తీసి, బీడీ అంటించి, మునిపళ్ల మధ్య బీడినిగట్టిగా పట్టి, కళ్లు చికిలించి, ఏదోఆలోచిస్తున్నట్టు కనబడ్డాడు.

“ఇంతకూ నువ్వొచ్చిన పని చెప్పావు కావు,” అన్నాడు శంకరం.

“మరేం లేదు. మీాతో శానా యిసయాలు మాట్టాడాల. టైము పడద్ది. మీాకు తీరిగ్గా ఉండే సమయం చూసి - ”

“ఇప్పుడు తీరికే. మాట్టాడు,” అని శంకరం ప్రోత్సాహం ఇచ్చాడు.

భద్రం ఆరిపోయిన బీడీని లైట

రుతో వెలిగించి, "మరేం లేదు. గురూగారూ. ఓ పిచ్చెరు తియ్యాలని!" అన్నాడు క్లుప్తంగా.

"పిక్చరా? ఎవరు?"

ఎవరో అయితే మన కేం దురదా! శతదినోచ్చవాలు చేసుకున్న పిచ్చెర్లలోనూ, యిడుదలవుతోనే గోయిందా గొట్టిన పిచ్చెర్లలోనూ సమంగా ఎగస్ట్రా యేసాలేస్తానే వుంటినిగా? మనవే తియ్యాల ఓ మంచి అవ్వల్ నెంబరు పిచ్చెరు!"

"మనవంటే నేకూడా అందులో ఉన్నానా యేం - కొంపతీసి!"

భద్రం చాలా అవమానానికి గురి అయినవాడి పోజు పెట్టి, రోషంగా, "ఇదుగో, శంకరం బాబూ! ఈ భద్రంగాడంటే యేటనుకున్నారు? మీరు నన్ను పిలిచి, 'అరే భద్రం! నీ కదా కమామీసూ నాకు నచ్చింది. నీ పదకం నచ్చింది. నీ శైటప్పు యావత్తూ నాకు నచ్చింది. పో, యెల్లు! మంచి పిచ్చెరు తీసి జనానికందించు! లచ్చలు చేసుకో! నీకు నే వెనకదన్నున్నాను,' అవటాంటే గాని ఈ భద్రంగాడు ప్రొడ్డూసర్నంటూ ముందు కడుగేస్తాడండీ? నన్నింతకాల వెరిక్కూడా బలేమాట సెలవిచ్చారే!" అన్నాడు.

శంకరం నవ్వి "అదేవిటి, భద్రం. నాకు నీమేలుకన్న కావలిసిందే వుందీ? నువ్వొక్కడివే పిక్చరు ప్రొడ్యూసు చేస్తున్నావా? కొంచెం కష్టవేవో?" అన్నాడు.

"కొండల్లే మీరుండగా నాకు భయవేటి, గురూగారూ?"

"నేను పెట్టుబడి పెట్టలేనే?"

"పెట్టుబడి దేంటిలెండి. ఏలచ్చాదికారి సన్నాసైనా పెడతాడు. అదీగాక, లాభాలు మన సరికిల్లోనే ఉండాలనినాఉద్దేశం. గవర్రై మావ ఓకోపు కాస్తానన్నాడు."

"ఇందులో గవరయ్యమావ కూడా ఉన్నాడూ?"

"గవర్రై మావలేకుండాపిచ్చెరు ఒక్క అడుగైనా ముందు కేస్తుందా? మావ వందమంది పెట్టు కాదూ? ఓ పది పదిహేను వేలు

చులాగ్గా పారేస్తాడు. ఇంకో అయిదో పదో కావాలన్నా ఏ యినప్పెట్టెలో దొరికేదీ తెలిసిన మొనగాడు. అదట్టా వుంచండి. మావకింద ఎలాంటి మెరికల్లాంటి కుర్రోళ్లున్నారని! ఒకడు పాటకి సిసింద్రీ, మరోడు మాటకి మతాబా. యీరోయేసానికి బుర్రిగాడి ముందెవరాగుతారండీ? మీరు బుర్రిగాణ్ణి చూళ్ళా? కళ్లమీదికిపడే జులపాలూ, డైమను మార్కు ముక్కూ మా ముచ్చటగా ఉంటాడు. ఏదీ ఇంకో వారంలో యిడదలైవొచ్చాక మీదగ్గిరికి తీసుకొస్తా. సినిమాల్లో చేరి లచ్చలు గడించి, ఇంజెక్సను బల్బులు కొనుక్కుని అమ్మాయిలతో సుకంగా ఉండక నీకీ జేబులు తడివే పనేంటిరా అని ఎన్నిసార్లో చెప్పా. 'యెదవ డబ్బు! డబ్బుకోసం జేబులు కొడతావా, చినబాబూ! అది ఆర్టు, ఆర్టు!' అంటాడు. నాకు తెలవకడుగుతాను, గురూ గారూ, యీరో కట్టటం ఆర్టు కాదూ?"

"ఎందుక్కాదూ? అది నటనకన్న కూడా పెద్ద ఆర్టు," అన్నాడు శంకరం.

"తరవాతా - బేబీ మీకు తెలుసుగా? సక్కలాంటి పిల్ల! కోటేసి నిలబెడితే లచ్చిందేవే! నవమోహిని! యీరోయినేస్తావే, పిల్లా?' అంటే పిచ్చెరు రిలీజయ్యాక డబ్బిచ్చే సరతు మీద యేస్తానంది. చాకులెండి!

"అయితే స్టార్ల నెవర్ని బుక్కు చెయ్యటం లేదా యేం?"

"ఎందుకండీ టార్లూ? పదిహేను మంది తార్లతో పది లచ్చలు తగలేసి రిలీజు చేస్తే మొదటి ఆటకే తెరలు చించినంత పని చేశారు. ప్రేచ్ఛకులు కొత్త మొహాలు చూపండని గొంతెత్తి అడుగుతున్నారు. అసలు స్టారంటే ఎవరు, శంకరం బాబూ? ఎంటీ ఆర్ మొదట తెరమీద దిగినప్పు డెవ్రా యీ అబ్బాయీ అన్నారు. యీనాడు యంటీ ఆర్ ఇంటి ముందు రోజూ తీర్థ ప్రజ! మానవ

చీమ నిమిషానికి పన్నెండడుగుల వేగంతో నడుస్తుందట !



ఉభయ కుశలోపరి

జనమెత్తి గోరేవాడు మొదట పుష్టాల. ప్లాస్టూ అంతే!"

"నీవేదాంతం..! అయితే మరి స్టూడియో, టెక్నీషియనులూ?"

"గవర్రెమావ కింద ఆర్టు డైరెగటరూ, డాన్సు డైరెగటరూ ఉన్నారు. స్టూడియో ఏర్పాటు చూస్తున్నా లెండి. గొడ్ల పాక స్టూడియో మూల బడిందిగా, దాన్ని బట్టీ పైరుమాళ్లు చవగ్గా అద్దెకు తీసుకుని, అందులో ఓ మూల సరుకు తయారు చేస్తున్నాడు. అందులో మనం సూటింగు చేసుకోవచ్చు."

శంకరం ఆవలించి ఒళ్లు విరుచుకుని, "ఏర్పాట్లన్నీ కట్టుదిట్టంగా

చేసుకున్నా వన్న మాట. శుభం! కానీ,'' అంటూ సంభాషణ పూర్తిఅయిన లక్షణాలు ప్రదర్శించాడు.

"అసలు విషయం అట్టే ఉండిపోయిందే, శంకరం బాబూ,'' అన్నాడు భద్రం కాస్త దీనంగా.

"అదేవిటి?'' అన్నాడు శంకరం ఆశ్చర్యంగా.

"ఇంకేవుందీ ? కద! ముఖ్యంగా ఆ యిసయమే మీసలహా కావాల.''

"అవును, ఆసంగతే మరిచా సుమా! ఏం కథ తీద్దామని? సోషలా, పురాణికా, ఫోక్లోరా?''

"చవగ్గా తియ్యటం మనకావలిసింది. అంచేత సీక్రెటేజెంటు కథ తీద్దావంటాడు గవరైమావ. 'చారీనంబరు 111' అంటే ఎట్టా వుంటుంది, శంకరంబాబూ!''

"పేరులో ఏవుంది? కథ బావుండాలి.''

"గవరైమావ ఓ కథ


సుధ కిదే మా స్వాగతం

మా ఉగాది కానుకలు :

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతి పొందిన

శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రి కథలు .... 4-00

తిమింగిలం వేట : శ్రీ కొడవటిగంటి కుటుంబరావు .... 2-50

ఐశ్వర్యం : ,, .... 3-50

బుడుగు I : ముళ్లపూడి వెంకటరమణ .... 2-00

నవోదయ పబ్లిషర్స్, విజయవాడ-2

చెప్పాడు. నేను రాశా. అక్కడక్కడా అచ్చుతప్పు లుండొచ్చు. కాస్త దీన్ని చూసి, మీ అభిప్రాయం చెబితే—"అంటూ భద్రం లేచినిలబడి, తాను కూర్చున్న స్టూలు మీదినుంచి ఈ లావు బైండు పుస్తకం తీశాడు.

"ఇదంతా కథే? దీన్ని చదవటానికి ఎన్ని మాసాలు పట్టును? నాకు టూకీగా కథ చెప్పరాదూ?" అన్నాడు శంకరం.

"అట్టా చేసినా చెయ్యొచ్చు," అంటూ భద్రం బైండు పుస్తకాన్ని స్టూలు మీద పెట్టి, దాని మీద కూర్చుని, "నూటపదకొండున్నాడే - మంచి రేసులెండి! ఆడు రైలెక్కటంతో పిచ్చెరు ప్రారంభమవుద్ది. ఆ ఫస్టుక్లాసు కంపార్టుమెంటులో ఒక ఆడదే వుంటుంది. అదే యీరోయిను. అదీ ఏజెంటే! నూట పదకొండు అమ్మాయి ప్రక్కన కూర్చుని నడుం చుట్టూ చెయ్యేసి దగ్గరికి లాక్కుని, 'నీ ఒడిలో వెచ్చగా' అని పాట పాడతాడు. మన కత్తెర లింగం ఆపాటను మంచి వొడుపుగా రాశాడు. ఇనేవాళ్ళకి శివమెత్తి పోవల్సిందే."

"సెన్సారు వాళ్లు తీసెయ్యమంటే?"

"ఇదివరకొచ్చిన పాటల్లో లేని మాటొక్కటీ అందులో లేదుగా. ఏ మొగమెట్టుకుని తీసేస్తారు, శంకరంబాబూ!" అన్నాడు భద్రం కయ్యానికి కాలుదువ్వుతూ.

"తరవాత?"

టికెట్టు కలెగట రొచ్చి, "టికెట్! టికెట్!" అంటాడు.

---

కళ్ళజోడు ఎక్కడో పారేసుకున్న కామేశ్వర్రావు మసగ్గా కన్పిస్తూన్న రోడ్డుమీద తడుముకుంటూ వస్తూండగా అతని చూపుకి అనీ అనసంత దూరంలో ఒక చిలక వచ్చి వాలింది. కామేశ్వరరావు చప్పుడు చెయ్యకుండా వెనుకనించి దాన్ని పట్టుకోబోయాడు. అది తప్పించుకుని పోయి "వెజ్జి పీనుగులా వున్నావ్! ఏమిటా వెధవపని" అని తిట్టింది.

"క్షమించండి సార్! మిమ్మల్ని చిలకేమోనను కున్నాను." అన్నాడు కామేశ్వర్రావు కంగారు పడి.

యీరోయిన్ మీదికి ఒరిగియున్న యీరో సరిగా కూచుంటాడు. యీరోయిన్ తన బట్టలు సరిచేసు కుంటుంది.

"టిక్కెట్టు కావాలా? ఇద్దరికీ కలిసి ఒక టిక్కెట్టుచాలా ? అంటాడు పురీష్."

"పురీషెవరు!" అన్నాడు శంక రం ఉలిక్కిపడి.

"ఆడేనండీ, నూటపదకొండు గాడు. ఆడి అసలుపేరు పురీష్. తెలుగుపేరు పెడితే ఏం బాగుం టుంది చెప్పండి! యెంకట సుబ్బయ్యా, రాధాకృష్ణమూర్తి, దశరదరామయ్యా అని యీరో కెట్టా పేరు పెట్టటం, గురుగారూ!"

"నిజమే. కానీ."

"ఆవటాంటూ యీరో జేబు లో చెయ్యిపెట్టి సిగిరెట్టు లైటరు లాంటిది తీసి, టుప్పు మనిపిస్తాడు. టిక్కెట్టు కలెగటరు కాస్తా చచ్చి పడిపోతాడు. ఆదిగమ్మత్తు లైటరు — రహస్య పిస్తోలన్నమాట. లైటరు కొనే పనిలేదు. దీన్నే ఉప యోగిస్తాం," అంటూ భద్రం లైటరు తీసి బీడీ వెలిగించటానికి ప్రయత్నించాడు. అది వెలగలేదు.

శంకరం నిప్పుపెట్టెలందిస్తూ "తరవాత?", అన్నాడు.

"తరవాత నూటపదకొండు చెయిను లాగి రైలాపి, దిగి, చీకట్లో కలిసిపోతాడు. ఆ తరు వాత నూటపదకొండును ఒక ఓటల్లో ప్రవేశిస్తూ చూపిస్తాం. ఇంగిలీసు ఓటళ్ళుండవూ, అటు వంటిది. ఆడపిల్లలు సర్వర్లుగా తిరుగుతూంటారు నర్సుల డ్రెస్సు వేసుకొని ఓపక్క బాలురూము డాన్సు సాగుతూంటుంది. ఒక అమ్మాయి నూటపదకొండును చూడగానే ఒక చిన్నగది చూపించి అందులోకి తీసుకు పోతుంది. ఆ అమ్మాయే — యీరోయిన్నమాట.

"'ఏం కావాలి!' అంటుం దమ్మాయి. 'నువ్వు.' అంటాడు యీరో. యమ డయిలాగు లెండి! అంటూ అమ్మాయిని ఒళ్ళో కూర్చోబెట్టుకుంటాడు. తరవాత చాలాసేపు అళ్ళ మొహాలే చూపి

స్తాం. ఆ మొహాల్లో ఆవ భావాలను బట్టి అంతా అర్థమై పోవాలి! సెన్సారు నా కొడుకులంటూకో లేరు. తరువాత అమ్మాయి లేచి చిలిపిగా యీరో చెంపమీద కొట్టి 'అల్లరి పిల్లాడు!' అని వెళ్లి పోయి భోజనం తెస్తుంది. యీరో ఆవురావురున తినేస్తాడు. బట్లరు వచ్చి బిల్లిస్తాడు. యీరో జేబు లోంచి పర్సు తీసి బట్లరు మొహాన కొడతాడు. పర్సు పేలిపోతుంది. అది చేతిబాంబు. ఆ చిన్న గది నిండా పొగ కమ్ముకుని ఉంటుంది. పొగ విచ్చిపోయేసరికి బట్లరు చచ్చిపడి ఉంటాడు. యీరో ఉండడు.

శంకరం అటూ యిటూ మసులుతూ చివర కేమవుతుంది?" అన్నాడు.

"పిచ్చరంతా ఇట్టాగే సాగుతుంది. చిట్టచివరకు – మీరు గనక చెబుతున్నాను. నూట పదకొండు యీరోయిన్‌ను విదేశీ ఏజెంటుగా పట్టిస్తాడు. ఆడియన్సులు ఆవలించాలిసిందే."

"అంతా బాగానే ఉంది గాని, భద్రం. కథలో జాతీయత బొత్తిగా లేనట్టుందే?" అన్నాడు శంకరం.

"అదేం భయంలేదు, శంకరం బాబూ. మన ప్రభుత్వం ఇంతలో సినిమాలను జాతీయం చెయ్యమని చెప్పేశారుగా!"

టెలిఫోన్ మోగింది. శంకరం లేచి వెళ్లి మాట్లాడి ఇవతలికొచ్చి, "భద్రం, నాకు అర్జంటు పని వచ్చిపడింది. తరవాత మాట్లాడదాం, ఏం?" అన్నాడు.

హాఫ్‌టోన్
లైన్
ట్రై కలర్ బ్లాకులు
రబ్బర్ స్టాంపులకు

గౌతమి
బ్లాక్ మేకింగ్
వర్క్స్
రాజమండ్రి - 1.